ఇంకెన్నాళ్లిలా?

తాడిగడప మునిసిపాలిటీకి సొంత భవనమేది?

- వసతులు లేని పంచాయతీ భవనంలో కార్యాలయం ఏర్పాటు
- భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం
- అన్నీ ఉన్నా నిర్మించడంలో నిర్లక్ష్యం

పెనమలూరు: తాము అధికారం చేపట్టిన వెంటనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం అంటూ ప్రగల్భాలు పలికిన కూటమి పెద్దలు.. ఆచరణలో మాత్రం మచ్చుకైనా చూపించలేకపోతున్నారు. ఇందుకు ఉదాహరణ తాడిగడప మునిసిపాలిటీ కార్యాలయ భవనం. ప్రస్తుతం చిన్నపాటి పంచాయతీ కార్యాలయ భవనంలో మునిసిపాలిటీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరుకైన కార్యాలయంలో వసతులు లేక ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

తాడిగడప మునిసిపాలిటీ 2021లో ఏర్పడింది. తొలుత తాడిగడప గ్రామ పంచాయతీ కార్యాలయంలో మునిసిపాలిటీ సిబ్బందికి కొంత స్థలాన్ని కేటాయించారు. ఇది ప్రజలకు అందుబాటులో లేక పోవటంతో చాలా ఇబ్బందులు పడ్డారు. తర్వాత పోరంకి పంచాయతీ కార్యాలయ భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇరుకైన ఆ భవనంలోనే కార్యాలయం కొనసాగుతోంది.

రూ. 5 కోట్లు మంజూరు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తాడిగడప మునిసిపాలిటీకి భవనం నిర్మించటానికి రూ. 5కోట్లు నిధులు మంజూరు చేశారు. కానూరులో భవన నిర్మాణం చేయాలని స్థల పరిశీలన చేసి రంగం సిద్ధం చేశారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో భవన నిర్మాణం ప్రారంభం కాలేదు.

ఎన్నికలప్పుడు ప్రగల్భాలు..

తాము అధికారం చేపట్టిన వెంటనే మునిసిపాలిటీకి భవనం నిర్మాణం చేస్తామని కూటమి నేతల ఎన్నికల్లో ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు కావొస్తున్నా భవన నిర్మాణం చేపట్టలేదు. పోరంకిలోనే తాడిగడప మునిసిపాలిటీకి భవన నిర్మాణం చేస్తామని కూటమి నేతలు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం అమలు జరగటం లేదు. పాత పోలీస్‌స్టేషన్ దగ్గర ఉన్న స్థలం ఇన్నర్‌రింగ్ రోడ్డుకు పోతుందని చెప్పటంతో మునిసిపాలిటీ కార్యాలయానికి ప్రతిపాదించిన స్థలాన్ని వదిలేశారు. పోరంకిలో శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయ పొలంలో రెండు ఎకరాలకు ప్రతిపాదించి సాంకేతిక కారణాలతో వదిలేశారు. పోరంకిలోనే తాజాగా మరో 70 సెంట్ల స్థలం చూశారు. ఇది కార్యరూపం దాల్చుతుందా లేదా అనేవి వేచి చూడాల్సి ఉంది.


పోరంకిలో మునిసిపాలిటీ కార్యాలయం ఉన్న పంచాయతీ భవనం

అన్నీ ఉన్నా వీడని గ్రహణం..

తాడిగడప మునిసిపాలిటీకి అన్నీ ఉన్నా ఆచరణలో మాత్రం గ్రహణం వీడటం లేదు. మునిసిపాలిటీ వార్షిక ఆదాయం రూ.30 కోట్లు ఉంది. టౌన్‌ప్లానింగ్, అకౌంట్స్, ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ, శానిటేషన్, పబ్లిక్ హెల్త్, మెప్మా, ఇలా అనేక విభాగాలు ఉన్నాయి. తాడిగడప జనాభా 3 లక్షలకు పైగా ఉన్నారు. 19 సచివాలయాల్లో 150 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఎన్నికలు జరిగితే 38 మంది కౌన్సిలర్‌లు వస్తారు. వారికి సమావేశానికి హాల్ లేదు. అలాగే మునిసిపాలిటీలో సిబ్బంది 50 మంది వరకు ఉన్నారు. పారిశుద్ధ్య కార్మికులు 400కు పై చిలుకు ఉన్నారు.

అడుగడుగునా ఇబ్బందులే..

తాడిగడప మునిసిపాలిటీకి సొంత భవనం లేక పోవటంతో అడుగడుగునా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కార్యాలయానికి వచ్చే ప్రజలు ఆరు బయట షెడ్డులో కూర్చోవాల్సి వస్తోంది. కార్యాలయం వద్ద తాగటానికి నీరు కూడా ప్రజలకు అందుబాటులో లేదు. పరిపాలనకు సంబంధించి కార్యాలయంలో సిబ్బంది అందరూ ఒకే చోట ఉండటం లేదు. శాఖలు తలా ఒక దిక్కున ఉండటంతో జనాలు తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా కార్యాలయం నిర్మించి అన్ని శాఖలు ఒకే చోట ఏర్పాటు చేస్తే కాని ప్రజల సమస్యలు తీరవు. దీని కోసం ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

త్వరలో నిర్మిస్తాం..



తాడిగడప మునిసిపాలిటీకి త్వరలో పోరంకిలో భవనం నిర్మిస్తాం. స్థల సేకరణకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి స్థల విషయం తీసుకు వెళ్లాం. అన్ని వసతులతో భవనం నిర్మిస్తేనే పరిపాలన పనులు సజావుగా వేగంగా జరుగుతాయి. ప్రజల సమస్యలు తీరుతాయి.

– షేక్ నజీర్, కమిషనర్, తాడిగడప మునిసిపాలిటీ

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్‌కు ఎంఆర్ ట్రస్ట్ సహాయం



నున్న(విజయవాడరూరల్): మొలుగుపాటి రామస్వామి ట్రస్ట్(ఎంఆర్) వ్యవస్థాపక అధ్యక్షులు మొలుగుపాటి ఫ్రాన్సిస్ ఎమ్మార్పీఎస్ సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అవసరమైన 75 కుర్చీల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి ఎంఈఎఫ్ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు యువరాజు సమక్షంలో చెక్‌ను అందజేసినట్లు ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మంద వేణు మాదిగ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మార్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఫ్రాన్సిస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ప్రతినిధులు మంద వేణు మాదిగ, కొప్పుల కామేశ్వరరావు మాదిగ, పులపాక పాస్కల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కుమ్మర్ల సంఘం అధ్యక్షుడిగా బొమ్మిన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన బొమ్మిన శ్రీనివాసరావు వరుసగా నాల్గో దఫా ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గతంలో రెండు దఫాలు ఉమ్మడి కృష్ణాజిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడిగా పని చేసిన ఆయన జిల్లా విభజన జరిగిన పిమ్మట రెండు దఫాలుగా ఎన్టీఆర్ జిల్లాకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పలు గ్రామాల్లోని కుమ్మర్లు ఆయనను అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం




కంకిపాడు: ఉద్యోగుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్‌సీలో బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగులకు గురువారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక, కృష్ణారావు, శ్రీనివాసరావు, ఏపీఎన్‌జీఓ కంకిపాడు యూనిట్‌అధ్యక్షుడు ఉండి పురుషోత్తమరాజు, ఉయ్యూరు యూనిట్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటకాలువ రోడ్డుకు శంకుస్థాపన



పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పోరంకి పరిధిలో పంట కాలువ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. పోరంకి సాలిపేట వాటర్ ట్యాంకు నుంచి గంగూరు సిద్ధిఖ్ నగర్ రోడ్డు వరకు సీఆర్‌డీఏ నిధులు రూ.6.20కోట్లతో ఒక 'బిట్' రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ పంట కాలువను దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్ ప్రసాద్, వి. శుభశేఖర్, పాతూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ పోటీల్లో సత్తా



పెనమలూరు: జాతీయ స్థాయి హ్యాక్ థాన్ పోటీలో సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ విద్యార్థుల బృందం ఉత్తమ ప్రతిభ చాటి ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు గురువారం ఐటీ విభాగాధిపతి ఎం.సునీత వివరాలు తెలుపుతూ పుణేలో ఇటీవల ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ పోటీల్లో తమ యూనివర్సిటీ ఐటీ విభాగం నుంచి నుంచి పిల్లి హనీష్ సారథ్యంలో విద్యార్థుల బృందం పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటి ప్రథమ బహుమతి గెలిచారన్నారు. రూ.3లక్షల నగదు బహుమతి అందుకున్నారని అన్నారు. వీసీ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



గన్నవరం రూరల్: గన్నవరం మండలం వీరపనేనిగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గతంలో ఎనిమిది సార్లు జిల్లా స్థాయికి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక అయ్యి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయ్యారు. తన దగ్గర చదివిన విద్యార్థులు యూఎస్ఏ వెళ్లారని, సైన్స్ ఫేర్, లిటిల్ టీచర్స్‌కు సెలెక్ట్ అయ్యారని చెప్పారు. 400 మందిలో తాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావటం గర్వంగా ఉందని తెలిపారు. ఆమెను గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాగరాజు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న బండ్లపల్లి నాగరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నాగరాజుకు చోటు లభించినట్లు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ గురువారం విలేకరులకు తెలిపారు. నాగరాజుకు ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్‌తో పాటుగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ముగిసిన ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవాలు

గన్నవరం: స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ శాటిలైట్ కార్యాలయంలో జరుగుతున్న ఆ సంస్థ 69వ ఆవిర్భావ దినోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఒకే రోజు అత్యధిక పాలసీలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న ఎల్ఐసీ ఏజెంట్లలో గన్నవరం బ్రాంచ్‌కు చెందిన వారిని సత్కరించారు. బ్రాంచ్ మేనేజర్ జేఎస్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 2న దేశ వ్యాప్తంగా ఎల్ఐసీ ఏజెంట్లు 5,88,108 పాలసీలు చేసి ప్రపంచ రికార్డు సృష్టించినట్లు తెలిపారు. ఈ ఘనతను సాధించిన వారిలో గన్నవరం బ్రాంచ్‌కు చెందిన 65 మంది ఎల్ఐసీ ఏజెంట్లు ఉండడం గర్వకారణమన్నారు. వారికి సర్టిఫికెట్లు అందజేసి సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు రవీంద్రనాథ్, అప్పలనాయుడు, హనుమంతరావు, జయప్రకాష్‌నారాయణ, ఎల్ఐఏఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన ఏజెంట్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రావణ్‌కుమార్

వేడుకగా గణపతి విగ్రహ నిమజ్జనాలు


రాయ్‌నగర్‌లో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తుడు


కంకిపాడులో భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్న నిర్వాహకులు

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లోని ఎన్టీఆర్ రోడ్డులో గణేష్ ఉత్సవ్ సమితి ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న గణపతి నవరాత్రులు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలోని లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. రాఘవేంద్ర ప్రాజెక్ట్స్ కిషోర్ రూ. 69,116కు దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న గణపతి నవరాత్రుల్లో భాగంగా భక్తులకు అన్నసంతర్పణ చేశారు. దావాజిగూడెంలోని నాయీబ్రాహ్మణ వీధిలో గణేశ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. కేసరపల్లి, అల్లాపురం, బుద్ధవరం, దావాజిగూడెం తదితర గ్రామాల్లో గణపతి నిమజ్జనాలు కొనసాగాయి.

గణపతికి ప్రత్యేక పూజలు..

కంకిపాడు: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా గురువారం కంకిపాడు పట్టణంలోని పలు మండపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రైతుబజారు ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తులకు అన్నసంతర్పణ జరిపించారు. బోడె వెంకటరామ్, తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, సుధీర్ పాల్గొన్నారు. కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకట రమణ, కొండా నాగేశ్వరరావు, వీరంకి శ్యాము, బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ నందు గురువారం జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను వివరించారు. ఉపాధ్యాయులు భవిష్యత్ తరాలను నిర్మించే వ్యక్తులన్నారు. జాతీయ సేవా సమితి కోఆర్డినేటర్ జి.శేఖర్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలోని వీరవల్లి, రేమల్లె జెడ్పీ హైస్కూళ్లలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. రేమల్లె జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల ఉపాధ్యాయులతో పాటుగా విశ్రాంత ఉపాధ్యాయేతర సిబ్బంది కొల్లేపల్లి నారాయణ రావును ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.లూథర్‌పాల్ పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి. స్వర్ణలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


తెంపల్లిలో ఎస్టీయూ సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు


సభలో మాట్లాడుతున్న డీఎస్ఎన్ రెడ్డి

గన్నవరం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వీరపనేని గూడెం, తెంపల్లి, చిన అవుటపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తీవ్రంగా మోసం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడే తీరికే లేకుండా పోయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో కనీసం ఒక్క డీఏ అయినా ఇవ్వాలన్నారు. పీఆర్‌సీ, ఐఆర్ బకాయిలు చెల్లించాలన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. ఆనంద్‌కుమార్, ఆర్.ఆనంద్‌కుమార్, చిమట కృష్ణారావు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి..

గన్నవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని ఏపీ ఎన్‌జీజీవోస్ పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు డీఎస్ఎన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీజీవోస్ భవనంలో గురువారం అసోసియేషన్ గన్నవరం తాలూకా యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. రమేష్ మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏ, పీఆర్సీ, సీపీఎస్‌పై పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విద్యాసాగర్ ఉద్యోగులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. గన్నవరం తాలూకా యూనిట్ అధ్యక్షుడు వి. సాంబశివరావు అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షుడు జి. రామకృష్ణ, విజయవాడ నగర అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, సహ అధ్యక్షుడు పి. రాజశేఖర్, మాజీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించడం మన బాధ్యత

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సిల్వర్‌జూబ్లీ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్, ఎంఈఓ-2 ఎం. కమలను ఉపాధ్యాయులు సత్కరించారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్రగా పేర్కొన్నారు. అటువంటి ఉపాధ్యాయులను గౌరవించడం విద్యార్థులు బాధ్యతగా భావించాలని చెప్పారు. పాఠశాల హెచ్ఎం కె. సువార్తరాణి, ఉపాధ్యాయులు డి. లత, ఎస్. శారద, కె. అరుణ, ఎస్కే ముతాంజ్ బేగం, భవిత కేంద్రం టీచర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డీవైఈఓ రవికుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

7న పూర్వ విద్యార్థుల సమావేశం

పెనమలూరు: కానూరులోని అన్నే శివనాగేశ్వరరావు, అరుణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 7వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి బి.అజరయ్య తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 2001-2002 బ్యాచ్ నుంచి 2024-2025 బ్యాచ్‌ల వరకు నిర్వహిస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థులు ఎక్కడ ఉన్నా ఈ సమావేశానికి హాజరై తమ ఆనంద సమయాన్ని గడపాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

స్కూల్లో విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మక్కెన వినోద్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని 305 మంది విద్యార్థులకు డాక్టర్ సునీత పర్యవేక్షణలో సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 33 మంది విద్యార్థులకు కంటి చూపు సమస్యలు ఉన్నట్లుగా గుర్తించినట్లుగా లయన్స్‌క్లబ్ గన్నవరం శాఖ అధ్యక్షుడు దండమూడి శ్రీనివాసరావు తెలిపారు. వీరికి లయన్స్‌క్లబ్ సౌజన్యంతో మెరుగైన వైద్యం అందించడంతో పాటు కళ్లజోళ్లు అందజేయనున్నట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, కోశాధికారి చెరుకూరి షీలా తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

కంకిపాడు: ప్రాంతీయ, కుల విద్వేషాలను రెచ్చగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రాంతీయ, కుల విద్వేషాలను రెచ్చగొట్టేలా ఏర్పాటు చేశారన్నారు. కించపరుస్తూ, హేళన చేసే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేయటం దారుణమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఫ్లెక్సీలు కట్టారని విమర్శించారు.

విగ్రహాల ఏర్పాటుకు తీర్మానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకై మెజార్టీ పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రామయ్య చెరువు సమీపంలోని ఖాళీ స్థలంలో జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు అంశంపై సమావేశం జరిగింది. తీర్మానానికి పాలకవర్గ సభ్యులతో ఓటింగ్ పద్ధతిన నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌తో పాటు 17మంది పాలకవర్గ సభ్యులకు గానూ 13మంది హాజరయ్యారు. వీరిలో విగ్రహాల ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా సర్పంచ్‌తో పాటు మరో ఆరుగురు వార్డు సభ్యులు ఆమోదం తెలుపగా, ఆరుగురు వార్డు సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. మెజార్టీ సభ్యులు విగ్రహాల ఏర్పాటుకు ఓటింగ్ వేయడంతో ఈ అంశం ఆమోదం పొందింది. పంచాయతీ కార్యదర్శి విద్యాధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏటిపాయకు తగ్గిన వరద



కంకిపాడు: ఏటిపాయలో వరద ఉధృతి క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. దీంతో ఏటిపాయలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధి గుండా కృష్ణానది ఏటిపాయ ప్రవహిస్తోంది. కొద్ది రోజులుగా ఎగువ నుంచి నీటి విడుదల నిలుపుదల కావటంతో నీటి ప్రవాహం తగ్గుతోంది. రోడ్డు మార్గం క్రమేపీ బయటపడుతోంది. అయితే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పేట్లు లేవని రైతులు, కూలీలు వాపోతున్నారు. పూర్తిగా నీటి ప్రవాహం తగ్గి, రోడ్డు పునర్నిర్మాణం చేపడితేనే రాకపోకలు సాధ్యమవుతాయని చెబుతున్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గన్నవరం రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ తెలిపారు. జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని తెంపల్లి, బల్లిపర్రు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అతితక్కువ ఖర్చుతో పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ బి.సుగుణ గురువారం నున్న గ్రామంలోని రెండు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే నిబంధనల మేరకు చర్యలుంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా యూరియ ఎరువుల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట రైతులకు మాత్రమే ఎరువులను విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. బ్లాక్‌లో అమ్మొద్దని హెచ్చరించారు.